epaper.manachourasta.com

# మన చౌరాస్తా

తెలుగు దిన పత్రిక



ట్రాఫిక్ రూల్స్ **పాటించాలి**

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

2

సంపుటి : 01 | సంచిక : 36 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 02 జనవరి 2026 | పేజీలు : 4



# దళితుల భూమి ఆక్రమించలేదు

- ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- కొత్త స్వరూపరాణి



**జనగామ, మన చౌరాస్తా :** జనటామ మండలం చౌడారంలో సర్వే నంబర్ 10 లో దళితుల భూమిని ఆక్రమించుకున్నారని గ్రామానికి చెందిన ముక్క స్వామి చేస్తున్న ఆరోపణల్లో నిజం కాదని కొత్త దీపక్ రెడ్డి తల్లి కొత్త స్వరూప రాణి పేర్కొన్నారు. తమపై వస్తున్న ఆరోపణలపై గురువారం ఆమె స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. తాము ఎటువంటి దళితుల భూమిని ఆక్రమించుకోలేదని, తమ పాస్ బుక్ లో ఉన్న 1 ఏ అసైన్డ్ భూమిని తొలగించాలని పలు మార్లు అధికారులకు విన్నవించామని తెలిపారు. ఆ ఎకురా భూమి కూడా దళితులే సాగు చేసుకుంటున్నారని విరించారు. నిరాధారమైన ఆరోపణల విషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అసత్య ఆరోపణలు చేస్తూ వాట్సాప్ గ్రూపులో మెసేజ్‌లు పెట్టి తమ గౌరవానికి భంగం కలిగిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 10 సర్వే నంబర్ పక్కనే ఉన్న తమ స్వంత భూమిని మాత్రమే గతంలో ప్రభుత్వ సర్వేయర్ ద్వారా సర్వే చేయించుకుని, ఫెన్సింగ్ వేసుకొని దానిలో మాత్రమే తాము సాగు చేసుకుంటున్నామని చెప్పారు. అయితే 10 సర్వే నంబర్ భూ విస్తీర్ణం చాలా పెద్దదని, అందులో కొంత మంది వారికి ప్రభుత్వం కేటాయించిన దానికన్నా ఎక్కువ సాగు చేసుకుంటున్న కారణంగా కొంత మంది దళితులకు భూమి లేనటువంటి సమస్యలు ఉన్నట్టు అక్కడ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

### మాకు సంబంధం లేదు : రమేష్

చౌడారం గ్రామంలోని సర్వే నంబర్ 10లో ఆక్రమణకు గురైందని కొంతమంది కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు నిరాధారమైన ఆరోపణని కాంగ్రెస్ నేత మంద రమేశ్ అన్నారు. తకు చట్టబద్ధత కలిగిన భూమిని తాము సాగు చేసుకుంటున్నామని చెప్పారు . 10 సర్వే నంబర్ అతి చివరన ఉన్నా నా నంబర్లు 10/5, 10/6. దానిలో నేను గత 15 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నానని తెలిపారు. మా పొలిమేర గెట్టు ఆనుకొని పక్కనే ఉన్న కొత్త దీపక్ రెడ్డి వారి పట్టా భూమిలోనే ఉన్నారని చెప్పారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా దీపక్ రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రభుత్వ అధికారులు స్పందించి నిజ నిర్ధారణ చేయాలని కోరుతున్నామని అన్నారు.



# ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలి

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ఈ నెలలో జరిగే జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం తన ఛాంబర్ లో కలెక్టర్ ఆవిష్కరించారు. 01 నుండి 31 వరకు అన్ని పాఠశాలల్లో రోడ్ సేఫ్టీ కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు సోమన్న హుండీ లెక్కింపు

పాలకుర్తి, మన చౌరాస్తా : జనగామ జిల్లా పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేడు (శుక్రవారం) హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న గురువారం తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆలయంలోని కళ్యాణ మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

## పారిశుద్ధ్య పనులు చేపట్టిన సర్పంచ్

**మద్దూరు, మన చౌరాస్తా :** మండలంలోని మర్మాముల, బంజర గ్రామ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త సంవత్సరంలో మొదటి రోజున గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ , మర్మాముల, బంజరా రెండు గ్రామాల్లోని పారిశుద్ధ్య పనులు చేశారు. బంజరా గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్ద గల బోరు మోటర్ నుండి నీరు వృధాగా పోవడాన్ని గమనించి సింగిల్ టాప్‌గా ఫిట్టింగ్ చేయాలని వాటర్ మ్యాన్, గ్రామ సిబ్బందిని ఆదేశించారు. అలాగే గ్రామంలోని రోడ్ల వెంబడి చెత్తాచెదారం పరిశీలించి వాటిని వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబర్లు సిబ్బంది పాల్గొన్నారు.





# సేవే లక్ష్యంగా 'ఎర్రబెల్లి ట్రస్ట్'

**పాలకుర్తి, మన చౌరాస్తా :** గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైనతాగునీరుందించడం కోసం ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారని బి ఆర్ఎస్ పాలకుర్తి మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్ తెలిపారు.జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోలక్ష్మీనారాయణపూరం గ్రామంలో ఎర్రబెల్లి ట్రస్టు ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ను గ్రామ సర్పంచ్ బోడిగే ప్రదీప్ తో కలిసి ప్రారంభించారు.బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పసునూరి నవీన్ అనంతరం మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే ఎర్రబెల్లి ట్రస్ట్ ఏకైక లక్ష్యం అని అన్నారు.గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకు అతీతంగా, ఎర్రబెల్లి ట్రస్టు సేవలు ఉంటాయని తెలిపారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్స్ పర్సన్ ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు సహకారంతో ఇప్పటికే గ్రామాలలో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిందని, మిగిలిపోయిన గ్రామాల్లో ప్రజల సౌకర్యం కోసం మరిన్ని వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాచర్ల



ఎల్లయ్య,జరుపుల బాలు నాయక్, పడిశే అశోక్, సరిత పరుశరాములు. గ్రామ శాఖ అధ్యక్షులు గుండెవేణి శ్రీకాంత్, లోడంగి గట్టయ్య, పోగు వాసుదేవ్, గుండె బిక్షపతి, పోగు అశోక్, ప్యారపు స్వామి, బెల్లి సోమయ్య, గిలకత్తుల అశోక్, కట్ల న్నారాయణ, బోడిగే బిక్షపతి, బందెపెల్లి సోమ నర్సయ్య, చిటురిచెంద్రయ్య, కోల నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# పేద కుటుంబానికి ఆసరాగా..

**పాలకుర్తి, మన చౌరాస్తా :** వడ్డేకొత్తపల్లికి చెందిన గొట్టిముక్కుల (హోటల్) యాదగిరి కుటుంబ సభ్యులకు నేషనల్ హ్యూమన్ రైట్స్ పెద్దవంగర మండల చైర్మన్, వడ్డేకొత్తపెల్లి ఆరవ వార్డు సభ్యుడు కుమ్మరి రామ్మూర్తి 25 కేజీల బియ్యాన్ని అందించారు. రామ్మూర్తి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండాలని, మనం ఎంత సంపాదించామన్నది కాదు ముఖ్యం ఎంతమంది పేదవారికి సహాయం చేశామన్నదే ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ పేదవారికి ఏదో ఒక రకమైన సహాయం చేయాలని అన్నారు. తెలంగాణ యూత్ అధ్యక్షుడు తంగళ్ళపల్లి కిరణ్ చారి, యూత్ సభ్యులు ఉమ్మనబోయిన సంపత్ కుమార్, వెల్మ బీరన్న, నాయకులు శివరాత్రి మహేందర్ తదితరులు ఉన్నారు.

# మొక్కలు నాటిన నూతన సర్పంచ్

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలం రసులాబాద్ గ్రామంలో గ్రామ సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామి గౌడ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుదర్శన్ మాజీ సర్పంచ్ స్వామి గౌడ్, వార్డు సభ్యులు మల్లేశం, బౌధుూర్ మంజుల శ్రీకాంత్, పరశురాములు, అంగన్వాడీ టీచర్ భారతి, కిరణ్, శ్రీనివాస్, ఐలేని మహిపాల్, సంతోష్, గ్రామ పంచాయతీ సిబ్బంది రాజు పాల్గొన్నారు.





# సీఎంకు కొమ్మూరి శుభాకాంక్షలు

**చేర్యాల, మన చౌరాస్తా :** జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గురువారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎం బొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


# సీఎంను కలిసిన భీమా లక్ష్మణ్

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** నూతన సంవత్సరం సందర్భంగా గురువారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు భీమా లక్ష్మణ్ ముదిరాజ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో యువతకు మరిన్ని గొప్ప అవకాశాలు కల్పిస్తూ, పార్టీని మరింత పటిష్టం చేయడంలో వారికి కీలక పాత్ర కల్పిస్తామని సీఎం చెప్పారని వివరించారు.



# సీఎంను కలిసిన టూరిజం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నేత

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు టూరిజం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి. ఈ సందర్భంగా టూరిజం శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, గతంలో హామీ ఇచ్చినట్లుగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, అలాగే పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగా పదవి విరమణ వయసును 61 సంవత్సరాలకు పెంచాలని ముఖ్యమంత్రి దృష్టికి సబ్బు రాజమౌళి తీసుకెళ్లారు. అలాగే తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో ప్రస్తుతం ఉన్న పలు సమస్యలను కూడా ముఖ్యమంత్రికి వివరించారు. వీటిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, టూరిజం కార్పొరేషన్‌లోని కొన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సబ్బు రాజమౌళి ఒక ప్రకటనలో తెలిపారు.



## బెల్టు షాపుల యజమానులపై కేసు నమోదు

దూల్మిట్ట, మన చౌరాస్తా : మండల పరిధిలోని జాలపల్లి, తోర్నాల గ్రామంలో బెల్ట్ షాప్ లో మద్యం పట్టుకున్నారు. ధూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో అనూష కిరాణా కొట్టు యజమాని నీలా శోభన్ బాబు నుంచి 7.8 లీటర్ల మద్యం, తోర్నాల గ్రామంలోని నాచగోని దయానంద్ గౌడ్ కిరాణా కొట్టులో 9.1 లీటర్ల మద్యం అమ్మకం కోసం ఉంచగా పట్టుకొని కేసు నమోదు చేసినట్టు మద్దూరు ఎస్సై ఆసిఫ్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# గ్రామాభివృద్ధికి పాలకవర్గంతో కలిసి కృషి చేస్తాం

## గట్ల నర్సింగాపూర్ సర్పంచ్ అజయ్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని గట్లనర్సింగాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దశలోకి తీసుకువెళ్లేందుకు పాలకవర్గం సహకారంతో సమిష్టిగా కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ తెలిపారు. గ్రామపంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అలాగే పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడంలో గ్రామస్తుల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని అన్నారు. యువతకు క్రీడా సదుపాయాలు, మహిళలకు సంక్షేమ పథకాల పూర్తి లబ్ధి, వృద్ధులు-పేదల సంక్షేమం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా పారదర్శక పాలన అందిస్తామని, గ్రామ పంచాయితీ పాలకవర్గం, వార్డు సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. కొత్త సంవత్సరంలో గ్రామాభివృద్ధి ప్రయాణంలో ప్రతి గ్రామస్తుడు భాగస్వామి కావాలని కోరుతూ, ప్రజల సహకారంతో గట్లనర్సింగాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోడిగే శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి గుడికంధుల మధు పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు దుర్శనపెల్లి మంగ, పెద్దబోయిన రమాదేవి, మేరుగు శోభ, సంగ ఐలయ్య, కాసనగొట్టు సాయిరాం, చిలుక ప్రమోద్, మాద్గుల అమర్, అంగిడి రాజమ్మ, మంద పద్మ, బొల్లంపల్లి రాజయ్య, మొలుగు కవిత హాజరయ్యారు.





# గాంధీ నగర్‌లో మెగా క్రికెట్ టోర్నమెంట్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గాంధీనగర్ గ్రామంలో ఈ నెల 4 ఆదివారం నుండి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాన్ని గురువారం నాడు గాంధీనగర్ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ, నేటి యువత మానసిక ఒత్తిడికి లోనై డ్రగ్స్, ఆన్‌లైన్ గేమింగ్, మద్యానికి బానిసవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. మరోవైపు అతివేగంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చుతున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచి, మనోధైర్యం మరియు క్రీడాస్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువతలో మార్పు కోసం చేపట్టిన ఈ ప్రయత్నంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు .ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ వార్డు సభ్యులు రమేష్, అశోక్ నిర్వహణ కమిటీ సభ్యులు తూముల అరవింద్, తాళ్లపల్లి ప్రసాద్, అరవింద్, విక్రమ్, ఉదయ్ కిరణ్, సంపత్, బిన్ను తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అవార్డులకు

# దరఖాస్తుల ఆహ్వానం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా** : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సేవా రంగంలో ప్రతిభ చూపిన యువజన సంఘాలు, మహిళా సంఘాల కోసం రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, వలస సుభాష్ చంద్రబోస్ యువజన అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. హనుమకొండ జిల్లా ముల్కనూర్ గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈసారి కూడా తెలంగాణ రాష్ట్ర స్థాయిలో సంకల్ప యువ పురస్కార్ అవార్డుల ప్రధాన ఉత్సవాన్ని జనవరి 23న హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేసిన 30 సంవత్సరాల వయస్సు లోపు యువజన సంఘాలు, మహిళా సంఘాలకు ఈ అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, గ్రామాభివృద్ధి వంటి వివిధ రంగాల్లో సేవలందించిన సంఘాలను రాష్ట్రస్థాయి అవార్డుల కోసం ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.అవార్డులకు దరఖాస్తు చేసుకునే యువజన, మహిళా సంఘాలు తాము చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, ప్రెస్ క్లిప్పింగులు, మెరిట్ సర్టిఫికెట్లు, బయోడేటా మరియు ఒక ఫోటోను దరఖాస్తుతో పాటు జత చేసి పంపించాలని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ విజ్ఞప్తి చేసింది. దరఖాస్తులు స్వీకరించే చివరి తేదీ 15.01.2026 సాయంత్రం 5 గంటల వరకు మాత్రమేనని, అందువల్ల అర్హత గల యువజన, మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వలస సుభాష్ చంద్రబోస్ కోరారు. దరఖాస్తులు పంపవలసిన చిరునామా వలస సుభాష్ చంద్రబోస్, వ్యవస్థాపక అధ్యక్షులు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ, ఇంటి నెం: 292, గ్రామం: కూరెల్ల మండలం: కోహెడ, జిల్లా: సిద్దిపేట, పిన్ కోడ్: 505473.. సామాజిక సేవా రంగంలో నైపుణ్యం, అంకితభావంతో పనిచేస్తున్న యువజన సంఘాలు, మహిళా సంఘాలు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.





## ప్రత్యేక కమిషనర్‌ను కలిసిన టిడబ్ల్యూజేఎఫ్ నేతలు

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** రాష్ట్ర సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక గారిని నూతన సంవత్సర సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ నూతన సంవత్సర డైరీని కమిషనర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, రాష్ట్ర కోకన్వీనర్లు పి. ఆనందం, బండి విజయ్ కుమార్, తన్నీరు శ్రీనివాస్, వల్లాల జగన్, కుడుతాడి బాపురావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించగా, భవిష్యత్తులో మరింత సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.

## మొక్కలు నాటిన సర్పంచ్ జహంగీర్



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలంలోని గురవన్నపేట గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత అనే కార్యక్రమంలో శ్రీపెద్దమ్మ గుడి ఆవరణంలో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ బుడిగె జహంగీర్ గౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ బండి లక్ష్మప్ప హాజరై ఈ మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్, వార్డు సభ్యులకు అభినందనలు తెలిపారు. మొక్కలు నాటే ప్రోగ్రాం జూన్, జులై మాసంలో ఉంటుందని, కానీ కొత్తగా ఎన్నుకోబడిన సర్పంచ్ బుడిగె జహంగీర్ ఉత్సాహంతో ముందుకు రావడం వల్ల ఈ రోజు నుంచే మొదలు పెట్టడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్ వర్మ, ఇన్‌చార్జి కార్యదర్శి జావిద్, ఉప సర్పంచ్ సతీష్ కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** యువకులు క్రీడా రంగంలో రాణించాలని,క్రీడల ద్వారా నైపుణ్యం పెరగడంతో పాటు ఆరోగ్యం మెరుగు పడుతుందని మున్సిపల్ 7 వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సీనియర్ నాయకులు పోతుగంటి ప్రసాద్ అన్నారు. చేర్యాల మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు లోని మైసమ్మ,రాజీవ్ నగర్ యూత్ యువకులకు తన స్వంత ఖర్చులతో క్రీడాసామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికంగా అధివృద్ధి చెందున్న నేటి సమాజంలో యువకులు చెడు వ్యసనాలు గురి కావద్దని, ఆన్లైన్ గేములు పక్కన పెట్టీ మానసికంగా శారీరకంగా మంచి ఆరోగ్యం ఉండాలంటే క్రీడలపట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆడేపు నరేందర్, కాంగ్రెస్ పార్టీ 4 వవార్డు ఇంచార్జ్ అంబాల బుచ్చిరాములు గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు నీలం సన్నీ, పోలోజు ఆంజనేయులు, ఎర్రోళ్ల భాను, పబ్బోజు రమేష్, బండి గణేష్, మనీష్, సందీప్, శీర్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.



## డీసీసీ అధ్యక్షురాలిని కలిసిన శైలజ రమేష్



**బచ్చనపేట, మన చౌరాస్తా :** మండలంలోని చిన్నరామచర్ల గ్రామానికి చెందిన ప్రముఖ కళాకారిణి కళ్లెం శైలజ రమేష్ గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కార్యాలయంలో అధ్యక్షురాలికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ధన్వంతి లక్ష్మీనారాయణ శైలజ రమేష్ తో కేక్ కట్ చేయించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. "శైలజ మరెన్నో పుట్టినరోజులు జరుపుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.తెలంగాణ మలిదశ ఉద్యమంలో కళాకారులు తమ ఆటపాటలతో కీలక పాత్ర పోషించారని, ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా గౌరవిస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ ఉపాధ్యక్షుడు బెజగం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పైపులైన్ల ప్రారంభానికి భూమి పూజ

**చేర్యాల, మన చౌరాస్తా :** ఆకునూర్ గ్రామం లో పైపులైన్ల నిర్మాణానికి గ్రామపంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి తెలిపారు. గురువారం గ్రామంలోని ఐదవ వార్డు సభ్యుడు జూపల్లి కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భూమి పూజ కార్యక్రమానికి సర్పంచ్ గ్రామపంచాయతీ పాలకవర్గం హాజరై ప్రారంభించారు. అంతకుముందు పోషమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో అన్ని వార్డుల్లో తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా పైపులైన్ లు లేని చోట ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, వార్డు సభ్యులు అందె లక్ష్మి, సూర అనిత, ఎండి. హైమద్, తాటికొండ శేఖర్, భూమని భాస్కర్, గణపురం బాల నర్సమ్మ, గ్రామ పెద్దలు అల్లెపు జనార్దన్, అందె అశోక్, అనుముల సిద్ధారెడ్డి, మంతపురి సత్తయ్య, సూర సంపత్, బరిగె వేణు, అనుముల రాజశేఖర్ రెడ్డి, కర్రె నర్సిరెడ్డి,కడారి రాజు, ఘనపురం అంజయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**